# ఎలిజీలు
## – గొల్లపూడి మారుతీరావు



*కౌముది ప్రారంభసంచిక నుంచి క్రమం తప్పకుండా కనిపిస్తున్న పేరు ఆత్మీయ మిత్రులు గొల్లపూడి మారుతిరావు గారు. ఆయన వ్రాసిన ఎన్నో నవలలు, కథలు , వ్యాసాలు, కాలంస్ కౌముదిలో వచ్చాయి. ఆనవాయితీ తప్పకుండా వారు వ్రాసిన ఎలిజీలు వ్యాసాలను నెలకొకటి చొప్పున పునర్ముద్రిస్తున్నాము. గొల్లపూడి మారుతిరావుగారు భౌతికంగా మన మధ్యన లేకపోయినా ఆయన అశీస్సులు కౌముదిని సదా వెన్నంటే ఉంటాయి.*

(ప్రారంభం)

**ఊర్వశీ ప్రియుడు**



విశాఖపట్నం ఏవియన్ కాలేజీ లైబ్రరీలో (నేను చెప్పేది 1954 మాట) నా తరానికి ముందు తరం నుంచే దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి పక్షము, ప్రవాసము, ఊర్వశి కలిసిన పుస్తకం చాలా పాపులర్. ఈ పుస్తకం మీద ఎవరో ఒక విద్యార్థి పెన్నుతో అద్భుతంగా ఊర్వశిని చిత్రించాడు. నవ్యసాహితీ సమితి పుణ్యాన కవుల్లో ప్రియురాలి కోసం విరహం ప్రారంభమయిందో, శాస్త్రిగారితో ప్రారంభమయిందో తెలీదు కానీ – 'ఏడుపు' కవిత్వం ఆ రోజుల్లో ఫ్యాషన్ – తర్వాత్తర్వాత శ్రీశ్రీగారి ధర్మమాంటూ విప్లవ కవిత్వంలాగ.

కటకటా లొటిపిటా చేస్తే

కృ.శా. విషాద కావ్యం రాయాలా?

అని శ్రీశ్రీగారు అంతకుముందే అన్నారు. ఏమయినా శాస్త్రిగారి గిరజాల జుత్తు వాసనలూ, అపూర్వమయిన ఉపన్యాస సౌరభం నా వంటివారు కొందరికి తెలీదు.

అయితే చదువు పూర్తయి ఆలిండియా రేడియోలో చేరేసరికి కృష్ణశాస్త్రిగారు సాహిత్య సలహాదారుగా ఉద్యోగం చేస్తున్నారు. ఆయనతో కలిసి పనిచెయ్యడం అప్పట్లో నాకు దక్కిన అదృష్టం.

అప్పటికే ఆయనకి గొంతు క్యాన్సర్ రావడం ఆపరేషన్, క్రమంగా మాట పోవడం ప్రారంభమయింది. తప్పక ఆయన చేతిలో చిన్నపుస్తకం, కలం ఉండేవి. ఓసారి రేడియో స్టేషన్‌లో నమస్కారం చేస్తే నన్ను పిలిచి కాగితం మీద రాశారు.

"నువ్వు నమస్కారం పెట్టకపోతే నేనేమీ అనుకోను. కానీ ఎడంచేత్తో మాత్రం పెట్టకు" అని. నాది కాస్త ఎడం చెయ్యివాటం. అప్పట్నుంచీ శాస్త్రిగారు కనిపించినప్పుడల్లా ఎడం చెయ్యిని సర్దుకునేవాడిని.

ఓసారి సాయంకాలం ఆఫీసునుంచి ఇంటికి వెళ్తూంటే నన్ను ఆపారు. సంక్రాంతికి గ్రామస్థుల కార్యక్రమంలో "బావొచ్చాడు" అనే సంగీత రూపకం ప్రసారం. ఆయనింకా రాస్తున్నారు. ఆరుగంటల 20నిముషాలకి ప్రసారం. అప్పుడు 5.15 అయింది. నన్ను చూసి నవ్వి "నా ముఖం రాగిచెంబులాగా ఉంటుంది. నాటకంలో 'బావ పాత్ర చేస్తావా?" అన్నారు. హాస్యానికీ - తనని తాను విమర్శించుకునే హాస్యానికీ శాస్త్రిగారు పెట్టింది పేరు. ఎగిరి గంతేశాను.

40 నిమిషాల నాటకం. ఎంతకీ నా పాత్ర రాదు. నాటకం రెండు నిముషాలకి అయిపోతుందనగా "ఏమర్రా పిల్లలూ" అని రాసిచ్చారు. నేను స్టూడియోలోకి వెళ్ళి మైక్ ముందు ఆ వాక్యం చదివితే బాలాంత్రపు రజనీకాంతరావుగారు, పాలగుమ్మి విశ్వనాథం గారు అంతా 'బావొచ్చాడు, బావొచ్చాడు'" అన్నారు .నాటిక అయిపోయింది. ఇదే నా పాత్ర.

అప్పటికే మల్లీశ్వరి, బంగారుపాప - ఇవన్నీ చరిత్ర. "ఇది వెన్నెల వేళయని, ఇది మల్లెల మాసమని తొందరపడి ఓ కోయిల ముందే కూసింది" అంటూ సినిమాలో కాలుజారిన ఆడపిల్ల గురించి ఇంత చక్కగా, గొప్పగా, అపూర్వంగా చెప్పడం నాకు తెలీదు.

అయితే శాస్త్రిగారు బద్దకిష్టు. ఎలా పట్టుకు రాయించేవారో 'మామా' అంటూ రజనీకాంతరావుగారూ, పాలగుమ్మి విశ్వనాథంగారూ సాధించేవారు.

"నారాయణ నారాయణ అల్లా ఓ అల్లా

నా పాలిటి తండ్రీ నీ పిల్లల మెమ్మల్లా" లాంటి పాటలు అటు శాస్త్రిగారు, ఇటు విశ్వనాథంగారూ కలిసి చిరస్మరణీయం చేసినవి. అందరు కవులూ కవిత్వం రాస్తే, ఆయన రాస్తాను రాస్తాను అంటూ "రాయని భాస్కరుడు" అని శ్రీశ్రీగారి చమత్కారం ఆయనమీద. ఓసారి నన్నూ, మిత్రుడు శంకరమంచి సత్యాన్నీ ఇంటికి తీసుకెళ్ళారు. నన్నయ్య కవిత్వం మీద పోతూపోతూ ఉన్న గొంతుతోనే ఆవేశంగా చెప్తూ, ఆయన కవిత్వ సౌరభాన్ని తనివితీరా చెప్పలేనందుకు కంటతడి పెట్టుకున్నారు.

ఎప్పుడూ అనేవాడ్ని - "మీరు ప్రతిదినం వ్రాసే యీ చిన్న పుస్తకాలన్నీ నాకివ్వండి. నేనో జీవితానికి సరిపడా ఆస్తిని సంపాదించుకుంటాను" అని, ఆయన పోయాక మిత్రుడు బుజ్జాయిగారు ఆ పుస్తకాలని ఏం చేశారో తెలీదు.

ఓసారి మా ఇంటికి వస్తే ఆయన రాసిన పాటని అక్కడే ఉన్న రేడియో ఆర్టిస్టు చేత పాడించాను. ఆయన చాలా ఆనందిస్తారనుకుంటూ.

దాదాపు పాటంతా నవ్వుతూ విన్నారు - "ఎలా ఉంది మీ పాట?" అంటే నన్ను దగ్గరికి పిలిచి "ఆ అమ్మాయి బాగానే పాడుతోంది. కానీ ఆ దిక్కుమాలిన పాట రాసింది నేనుకాదు" అని రాశారు.

ఆయనచేత నేనారోజుల్లో ప్రచురించిన 'కళావని' అనే వ్యాస సంపుటిలో మొదటి పద్యాలు రాయించాలని దాదాపు నాలుగునెలలు తిరిగాను. తిప్పుతున్నందుకు ఆయనేం ఇబ్బందిపడకపోగా, అలా పక్కనే నాలాంటివాళ్ళుండటం అలవాటుగా భావించారు. చివరికి రాయలేదు.

"అవధరింతువు ప్రతిదిన సాంతమందు

నిత్య నూతన తాండవ నృత్యకేళి"

అనే వాక్యాలున్న పాత పద్యాలనే అందులో పునర్ముద్రించుకున్నాను.

ఓసారి రేడియో స్టేషన్‌కి వచ్చారు. అప్పటికాయన రిటైరయి చాలా సంవత్సరాలయింది నేనాయనతో కారుదాకా నడిచి వస్తుంటే "కారు అమ్మేద్దామనుకుంటున్నాను. చేతిలో డబ్బుల్లేవు" అని రాశారు.

"మీరు పాటలు రాస్తానంటే, చెప్పండి. మీ చేత రాయించి నేను కొత్తకారు కొనుక్కుంటాను" అన్నాను.

నవ్వి "చెప్పు. రాస్తాను" అన్నారు.

నేను "అమెరికా అమ్మాయి" సినిమాకి రాస్తూ నవతా కృష్ణంరాజుగారికి చెప్పాను. దేవులపల్లి వారిచేత ఓ పాట రాయిద్దామని.

"అమ్మో ఆయన రాస్తారా?" అన్నారు.

వచ్చారు. జి.కె వెంకటేశ్ గారి సంగీత దర్శకత్వం. ఆ రోజు ఆయన అసిస్టెంటు ఆ తరువాత ఎన్నో కీర్తి శిఖరాలను అధిష్ఠించిన ఇళయరాజా. అమెరికా నుంచి వచ్చిన అమ్మాయి తెలుగు వారిముందు పాడాల్సిన తెలుగుపాట - అదీ సన్నివేశం.

"పాడనా తెలుగు పాట -

పరవశమై మీ యెదుట మీ పాట" అన్నారు శాస్త్రిగారు. ఆ సినిమానంతటినీ తూకం వేసేటంత అద్భుతమైన పాట. "ఇక్కడ అందరి మొహాలు డోకొస్తున్నాయి. నా పక్క కూర్చో" అని అన్నారు.

తెలుగు వాక్యం రాయడంలో అంత అందమయిన నుడికారం శాస్త్రిగారిలో, శ్రీశ్రీగారిలో చూశాను. మరో మహానుభావుడు వేలూరి శివరామశాస్త్రిగారు.

దేవులపల్లి వారు నవ్య కవిత్వానికి గ్లామరుని సంతరించిన వ్యక్తి.

తెలుగు సినీపాటకి గొప్ప వయ్యారాన్నీ, గడుసుదనాన్నీ అబ్బించిన కవి. చివరిదాకా కవి పాదుషాలాగే జీవనం సాగించిన మనిషి.

ఆయన పోయారని తెలియగానే నేనూ మా ఆవిడ ఇంటికి వెళ్ళాం. పాలగుమ్మి పద్మరాజుగారున్నారు.

శాస్త్రిగారు కాస్త దీర్ఘనిద్రలో ఉన్నారంతే.

"ఎవరని ఈ రేయి నిదుర హృదయమదర
వేయి చేయి ఛాయలాడ పెను చీకటి సైగలతో నా కన్నుల
రక్తమురల లాగి కొందరు
ఇపుడా నను పలకరింతురు?" అంటున్నారంతే

*(వచ్చే నెలలో మరో ఎలిజీ)*

Post your comments